# మానవుడు-మాధవుడు

-భమిడిపాటి సోమయాజి

అచ్యుతం ఆదిలక్ష్మి భార్యాభర్తలు. ఈ దంపతులకి యిద్దరు ఆడపిల్లలు, యిద్దరు మగపిల్లలు. ఆదిలక్ష్మికి దేవుళ్లంటే అత్యంత ప్రీతి. నిత్య పూజలు క్రమం తప్పకుండా చేస్తూంటుంది. స్వామీజీలంటే అత్యంత గౌరవం. తాము నివాసముంటున్న ప్రదేశానికి ఎంత దూరమైనా ఎవరైనా స్వాములు అక్కడికి వస్తే ఎలాగైనా తీరికచేసుకుని అక్కడికి వెళ్లి వారి దర్శనం చేసుకుని అక్కడ వాళ్ల ప్రవచనాలు విని ఆనందిస్తుంది.

అచ్యుతంకి దేవుడంటే యిష్టమేకానీ మరీ వెర్రిభక్తి కాదు. కేవలం పూజలు చేయడంకంటే తోటిమనిషికి కావలసిన సహాయం చెయ్యడమే గొప్పని నమ్మిన వ్యక్తి. మానవసేవే మాధవసేవ అంటాడు. వీళ్ల యింటి దగ్గర్లోనే మాధవమూర్తి అని ఒకాయన వుంటున్నాడు. ఈయన చాలా ధనవంతుడు. దేవుడున్నాడని నమ్మడు. ఏ మనిషైనా నిజాయితీగా, పట్టుదలతో శ్రమించి జీవితంలో ఉన్నత స్థాయికి రావాలని నమ్మిన వ్యక్తి. ఈయన తరచుగా అచ్యుతం యింటికి వస్తూంటాడు. ఈయనతో ఎక్కువసేపు తన భర్త మాట్లాడుతూ కూర్చోవడం, ఆదిలక్ష్మికి యిష్టం వుండదు.

తరుచుగా అచ్యుతంతో చెపుతూంటుంది, "ఈ మాధవమూర్తిగారు దేవుని పేరు పెట్టుకున్నాడుగాని, ఆయనకి దేవుడు మీద అసలు నమ్మకం లేదు. కేవలం మనిషి తన కృషితోనే పైకి వస్తాడంటాడు. దేవుని దయలేని మనిషి ఓ పెద్ద సున్నాతో సమానం"

"పోన్లేవే! ఎవరి నమ్మకాలు వాళ్ళవి. ఇతరులు నమ్మినదాన్ని వాళ్ళు ఆచరిస్తారు. మధ్యలో మనకెందుకు? ఆయన నమ్మకాలు మనమీద రుద్దటం లేదు కదా ఆ మూర్తిగారు" అంటాడు అచ్యుతం.

ఓ రోజు దీనికి సంబంధించిన విషయం ప్రస్తావన జరుగుతూండగా, మాధవమూర్తి యింటి పక్కన వుండే విష్ణువర్ధన్‌గారు వచ్చారు.

ఈయన యాత్రా స్పెషల్ బస్సులు నడుపుతాడు. ఈ విష్ణువర్ధన్‌గారంటే ఆదిలక్ష్మికి చాలా గౌరవం.

ఈయన చాలా భక్తుడనీ, యాత్రా స్పెషల్ బస్సులో వెళ్ళకపోయినా, ఒక్కొక్క యాత్రా ట్రిప్ అయిన తర్వాత తిరిగి వచ్చిన వెంటనే, వివిధ దేవుళ్ళ ప్రసాదాలు చుట్టుపక్కల వాళ్ళందరికీ యిస్తాడనీ, అసలు సేవా తత్పరత అంటే యిలా వుండాలని, ఆదిలక్ష్మి తరచుగా అచ్యుతంతో చెపుతూంటుంది.

విష్ణువర్ధన్‌గార్ని చూడగానే, "మీకు ఎన్ని పనులున్నా మధ్యమధ్యలో వచ్చి మమ్మల్ని చూసి వెళుతూంటారు. నాకు అన్నదమ్ముల లోటు కనపడనీయరు! కూర్చోండి కాఫీ తెస్తాను"

"చెల్లమ్మా కాఫీ వద్దు. రేపే మన యాత్రలు మొదలవుతున్నాయి. కాశీ ఆ చుట్టుపక్కల ప్రదేశాలకీ వెళుతున్నాం. ఇంకా రెండుసీట్లు ఖాళీగా వున్నాయి. మీరేం డబ్బు యివ్వక్కర్లేదు. ఈ సంసారంలో పడి కొట్టుకుంటున్న మనకి మధ్య మధ్యలో మనశ్శాంతి కలగాలంటే దైవదర్శనాలు చేసుకోవాలి. ఈ విషయం చెపుదామని పొద్దున్నే వచ్చాను. బట్టలు సర్దుకుని సిద్ధంగా వుండండి. రేపు పొద్దున్నే అయిదుగంటలకల్లా బస్సు మన యింటి దగ్గరకి వచ్చేస్తుంది. మనకి వచ్చిన సదవకాశం వదులుకోకూడదు. మరి నేను వస్తా చాలా పన్లున్నాయి" అని నిష్క్రమించాడు విష్ణువర్ధన్.

"మంచిది అన్నయ్యగారు!" అంది ఆదిలక్ష్మి.

"ఏమండీ విన్నారు కదా! ఎప్పట్నుంచో కాశీ వెళదామనుకుంటున్నాను. పిల్ల పెళ్ళికని దాచిన ఆ ఎనభైవేలలో ఓ పదివేలు బ్యాంక్ నుంచి తెండి. ఎందుకైనా మంచిది. ప్రయాణాల్లో తగినంత డబ్బు కూడా వుంటే మంచిది" అంది భర్తతో.

"ఆ డబ్బు చాలా కష్టపడి దాచాను. అందులో ఖర్చు చేసేవంటే, పిల్ల పెళ్ళికి తక్కువ పడుతుంది. ఇంకెక్కడైనా, ఓ నాలుగు వేలు అప్పు చేసి తెస్తాను. నువ్వొక్కదానివి వెళ్ళిరా!" అన్నాడు అచ్యుతం.

"అయ్యో! దైవదర్శనాలు దంపతీయుక్తంగా చేసుకోవాలి. అన్నింటికీ ఆ దేవుడే వున్నాడు. మీరూ రండి" అని పదే పదే అంటుంటే విధిలేక ఒప్పుకున్నాడు అచ్యుతం.

ఓ పదివేలు తీసుకుని దంపతులు యాత్రలకి వెళ్ళారు.

యాత్రలు జరుగుతున్నాయి. బస్సు కాశీ వెళ్ళిన తర్వాత, విష్ణువర్ధన్, ఆదిలక్ష్మితో "చెల్లెమ్మా! ఓ అయిదు వేలుంటే యియ్యి. మళ్ళీ మనం హైదరాబాద్ వెళ్ళిన తర్వాత యిచ్చేస్తా" అన్నాడు.

"అయ్యో దానికేం, అన్నయ్యగారూ" అంటూ అచ్యుతంతో చెప్పి ఓ అయిదు వేలు యిప్పించింది.

యాత్రలు పూర్తి చేసుకుని హైదరాబాద్ వచ్చేసరికి, తీసుకెళ్ళిన పదివేలలో ఓ వెయ్యి మిగిలింది.

యాత్రలైపోయి రెండు నెలలు గడిచినా, ఆ అయిదు వేలు యివ్వలేదు సరికదా, ఆ మాటే ఎత్తలేదు విష్ణువర్ధన్.

ఆదిలక్ష్మి మాత్రం "ఆ డబ్బు అడక్కండి, మర్యాదపోతుంది. ఆయన కూడా నిత్యపూజలు చేస్తాడు. దైవభక్తి వుంటే పాపభీతి వుంటుంది. ఆయనే యిచ్చేస్తాడు" అనేది.

★★★

ఓ రోజు విష్ణువర్ధన్ వచ్చి, ఆ అయిదువేలు యిచ్చేసి ఆలస్యమైనందుకు ఏమీ అనుకోవద్దన్నాడు. కాఫీ తాగి వెళ్ళమంది ఆదిలక్ష్మి.

"వద్దమ్మా! ఈ డబ్బు యివ్వడం ఆలస్యమై

నందుకు నాకు సిగ్గుగా వుంది. ఈసారెప్పుడైనా తాగుతాన్లే'' అన్నాడు.

విష్ణువర్ధన్ వెళ్ళిన తర్వాత ఆదిలక్ష్మి అచ్యుతంతో అంది ''చూశారా! డబ్బు యిచ్చినప్పుడు ఓ కాయితం కలం లేకపోయినా నిజాయితీగా



పట్టుకొచ్చి యిచ్చేశాడు. ఈ డబ్బు తిరిగి యిచ్చేలోపు, మళ్ళీ దీని ప్రస్తావనే చెయ్యలేదు. పన్లు చేసేవాళ్ళు మాటలు చెప్పరండి''

''ఓహో!'' అన్నాడు అచ్యుతం.

ఆ 'ఓహో' అన్న మాట విని, తన రాక చూసి అన్నాడేమో అనుకున్నాడు, మాధవమూర్తి.

తమ యాత్రా విశేషాలు చెప్పడం మొదలుపెట్టిన అచ్యుతం కేసి నిరుత్సాహంగా చూశాడు మాధవమూర్తి.

అక్కడే వున్న ఆదిలక్ష్మికి మాధవమూర్తి మొహం అలా పెట్టినందుకు బాధకల్గింది. ఎంత దేవుడు లేడనుకున్నా అసలు దేవునికి సంబంధించిన విషయం వినకపోవడమేమిటి, అనుకుంది.

కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయాడు మూర్తి.

లోపలికి వచ్చిన అచ్యుతంతో ''అదేమిటండీ! మొహం అలా పెట్టాడు. దేవుడంటే నమ్మకం లేని వాళ్ళకి అసలు యాత్రల గురించి చెప్పుదామని ప్రయత్నమెందుకు చేశారు'' అంది.

''పోన్లే! ఎవరి నమ్మకాలు వాళ్ళవి వాళ్ళని తప్పుపట్టడమెందుకు!''

***

కొన్నాళ్ళ తర్వాత, ఓరోజు విష్ణువర్ధన్ వచ్చి, ''పెద్దమ్మాయికి పెళ్ళి చెయ్యండి. నేను ఆ పిల్లకి మేనమామలాంటివాడ్ని. నేను కూడా సహాయం చేస్తాను. ఎంత డబ్బవసరమవుతుందో, ఓ పది రోజుల ముందు చెబితే చాలు'' అన్నాడు ఆదిలక్ష్మితో.

''చాలా సంతోషం అన్నయ్యగారూ! దైవం మానుష రూపేణా అంటే యిదే!''

''నేవస్తా, చెల్లెమ్మా! ఈసారి ఓ పెద్ద యాత్ర ఏర్పాటు చేస్తున్నాను. నేపాల్ వెళుతున్నాం, పశుపతినాథ్ దర్శనమవుతుంది యాత్రికులకి. నువ్వు బావగారూ కూడా రండి. టిక్కెట్లకేమీ యివ్వక్కర్లేదు''

''అయ్యో! వద్దు అన్నయ్యగారూ! మీకు మా వల్ల నష్టమెందుకు?''

''అదేమిటమ్మా! ఆదిలక్ష్మి పేరుగల నువ్వూ, అచ్యుతం పేరుగల మా బావగారు, నా యాత్రా స్పెషల్ బస్సులో రావడమే నాకు అదృష్టం. లాభం'' అన్నాడు విష్ణువర్ధన్.

''ఈసారెప్పుడైనా వస్తాంలెండి! ఈ పెద్దపిల్ల పెళ్ళయిపోతే మేము స్థిమిత పడతాం!''

''సరే! అలాగే కానివ్వండి'' అని వెళ్ళిపోయాడు.

***


ఓ నాలుగు రోజుల తర్వాత మళ్ళీ వచ్చాడు విష్ణువర్ధన్.

"చెల్లెమ్మా ఏమిటో మతిపోతోంది నాకు!"

"ఏమిటి విషయం చెప్పండి అన్నయ్యగారూ"


"ఏం లేదు పెద్దయాత్ర అని చెప్పాను కదా. ఇంకా టిక్కెట్లు ఎక్కువ అమ్ముడు పోలేదు. వున్న రెండు బస్సులూ రిపేర్ వచ్చాయి. ఓ ఎనభైవేలు ఖర్చు అవుతుంది. మీ దగ్గర ఏమైనా ఓ యాభైవేలుంటే సర్దుబాటు చేస్తే మళ్ళీ యిచ్చేస్తా!" అన్నాడు.

అచ్యుతాన్ని లోపలి గదిలోకి పిలిచింది ఆదిలక్ష్మి. "చాలామంచివాడు. దైవభక్తుడు. ఆ ఎనభైవేలల్లో ఓ ఏభైవేలు యిద్దామండి. మన పిల్ల పెళ్ళికి తాను కూడా సహాయం చేస్తానని మొన్నొచ్చినప్పుడు చెప్పాడు కూడా. ఆయనంతట ఆయన సహాయం చేస్తానన్నప్పుడు ఆయన నోరు తెరచి అడిగినప్పుడు మనం సహాయం చెయ్యకపోతే అసహ్యంగా వుంటుంది" అంది.



# 'డాన్'ల పోటీ?

దాదాపు ముప్పయ్యేళ్ల క్రితం వచ్చిన అమితాబ్ 'డాన్'కి కొన్ని మార్పులతో షారుఖ్ హీరోగా కొత్త 'డాన్' వచ్చింది. ఫర్హాన్ అఖ్తర్ దర్శకత్వంలోనే ఈ కొత్త డాన్‌కి సీక్వెల్ కూడా నిర్మాణం కాబోతోందిట. ఇదే సమయంలో అమితాబ్‌తో పాత డాన్‌కి సీక్వెల్‌ని నిర్మించే సన్నాహాలు చేస్తున్నారట అలనాటి 'డాన్' నిర్మాతలు. ఇందుకు అమితాబ్ నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చిందనేది తాజా సమాచారం. అమితాబ్-షారుఖ్‌ల మధ్య 'డాన్'ల పోటీ అన్నమాట!




ఓ ఏభైవేలు సర్దుబాటు చేశారు. ఆ చెక్కు తీసుకుని, "చచ్చి మీ కడుపున పుడతానని" వెళ్ళిపోయాడు.

***

తర్వాత, యాత్రల నుంచి తిరిగి వచ్చిన విష్ణువర్ధన్, ప్రసాదం పొట్లాల పైన దేవుడు పేర్లు విడి విడిగా రాసి యిచ్చాడు.

అచ్యుతం పెద్దపిల్ల పెళ్ళి నిశ్చయమయింది. సహాయం చెయ్యమని విష్ణువర్ధన్‌గార్ని అడిగారు. "తప్పకుండా చేద్దాం!" అన్నాడు.

ఓ నెల రోజులలో పెళ్ళి వుందనగా, విష్ణువర్ధన్ అచ్యుతం యింటికి రావడం మానేశాడు.

అచ్యుతానికి కొంచెం బెంగ మొదలైంది. ఈ పిల్ల పెళ్ళికి మొత్తం ఎంత ఖర్చవుతుందోనని. భార్యతో అన్నాడు.

"ఈ విష్ణువర్ధన్ యీ మధ్య రావడం తగ్గించేశాడు. పెళ్ళికి, ఆయన చేస్తానన్న ధన సహాయం చెయ్యకపోయినా ఫర్వాలేదు, మన ఏభైవేలు యిచ్చేస్తే అదే పదివేలు"

"ఏం కంగారుపడకండి! దైవభక్తిగలవారు పాపం చెయ్యరు!"

మొత్తం పెళ్ళిఖర్చు కట్నంతో సహా, లక్షా డబ్బై అయిదు వేలు అయ్యేటట్లుంది.

ఇక పెళ్ళి పదిహేనురోజులుందనగా, ఓ వందమంది చేత టిక్కెట్లు కొనిపించి, ఆ వున్న రెండు బస్సులూ అమ్మేసి, విష్ణువర్ధన్ జెండా ఎత్తేశాడని తెలిసింది. పాపం! ఈ విషయం తెలుసుకున్న అచ్యుతానికి, ఆదిలక్ష్మికి మతిపోయింది.

ఓరోజు అచ్యుతం యింటికి వచ్చిన మాధవమూర్తికి జరిగిన మోసం చెప్పాడు, అచ్యుతం.

"ఏం కంగారుపడకండి! నాకు డబ్బుకేం లోటు లేదు. ఓ లక్షా పాతికవేల దాకా నేను సహాయం చేస్తాను. మీ పెద్దమ్మాయి నా కళ్ళముందు పుట్టింది. చిన్నప్పట్నుంచీ మా యింటికి వచ్చి నన్ను అంకుల్ అంటూ ముద్దు ముద్దుగా పిలిచేది. మా అబ్బాయిల్ని అన్నయ్య అని పిలిచేది. నేనిస్తానన్న లక్షాపాతిక వేలలో ఓ డబ్బై అయిదు వేలు ఊరికేనే తీసుకోండి. ఓ ఏభై వేలు మెల్లమెల్లగా మీరు యివ్వగలిగినప్పుడు యిద్దురుగాని. నాకు ఆడపిల్లలు ఎలాగూ లేరు. మీ పిల్ల పెళ్ళికి సహాయం చేస్తే, నా మగపిల్లలు కూడా వృద్ధిలోకి వస్తారు. తోటి మనిషికి సహాయం చెయ్యలేని మానవ జన్మ వృధా!" అన్నాడు మాధవమూర్తి.

ఈ మాటలు విన్న ఆదిలక్ష్మి, అచ్యుతం ఆయనకి పాద నమస్కారం చేశారు.

ఆయన వెళ్ళిన తర్వాత, అచ్యుతం తన భార్యతో అన్నాడు. "నువ్వెప్పట్నుంచో ఈ మాధవమూర్తంటే అయిష్టంగా వుండేదానివి. ఇతనికి దైవభక్తి లేదని నిందించేదానివి. ఆ విష్ణువర్ధన్‌ది, ఈయనిదీ, విష్ణుదేవుని పేర్లే! ఒకడు ప్రసాదాలు పంచిపెడుతూ, ప్రజల్ని మోసం చేశాడు. దేవుడు లేడు అంటూనే, తోటి మనిషికి సహాయం చెయ్యకపోతే మానవ జన్మ వృధా అన్న పెద్ద సిద్ధాంతాన్ని అనుసరించాడు ఇంకొక మానవమూర్తి. వీళ్ళల్లో ఎవరు గొప్పంటావు! అందుకనే నేనెప్పుడూ ఎవరి నమ్మకాన్ని విమర్శించను" అన్నాడు.

"అవునండీ! నా తప్పు క్షమించండి!" అంది ఆదిలక్ష్మి.

పిల్ల పెళ్ళైన తర్వాత మాధవమూర్తి దంపతుల్ని నూతనవస్త్రాలతో సత్కరించారు అచ్యుతం దంపతులు.

★